## చిన్నకథ

# అలారం

బయట ఈదురు గాలులు.. రాత్రంతా విచిత్రమైన కల వస్తే నిండా ముసుగుతో కలని నెమరు వేసుకుంటూ వుండగా, నా ఫోను మోగింది. మళ్లీ మొదలైనయి ఫోన్లు అంటూ కూతురు ఫోను నా పక్కనే పడేసి వెళ్లింది. అవును, నిజమే! సెల్‌ఫోన్లు నిద్రలేపడానికి ఇంత బాగా పని చేస్తాయని ముందే తెలిస్తే అలారం గడియారాలు కనిపెట్టేవాళ్లు కాదేమో! ఫోను అందుకొనే లోపు రింగ్ ఆగిపోయింది. మిస్‌కాల్ చూసుకోకుండానే మళ్లీ దుప్పట్లోకి దూరిపోయాను. ఆ సుఖం క్షణాలే. మళ్లీ మోగింది ఫోను. ఆఫీసు నుంచి ట్రాన్స్‌ఫర్స్ ఫైలు తీసుకొని అర్జంటుగా రమ్మని బాసు కేక. ఆ కేకలో నా నిద్ర, నా కల రెండూ గాలిలో కలిసాయి. చకచకా రెడీ అయి ఆఫీసుకెళ్లాను.






ఫైలు కోసం వెతికితే ఎక్కడ పెట్టానో గుర్తుకు రావడం లేదు. అప్పటికే బాసు గంట నుంచి కారాలు మిరియాలు నూరుతున్నట్టు బంట్రోతు చెపుతూనే వున్నాడు. బెల్ మోగింది. నా గుండె దడుక్కుమంది. నా అదృష్టం బాగుండి ఫైలు ఎక్కడ పెట్టానో గుర్తుకు వచ్చింది. రాత్రి బాస్‌తో డిస్కషన్ చేస్తూ బాస్ టేబుల్ ఫైనే పెట్టినట్టు గుర్తు.

ఒక్కసారి ధైర్యంతో లోపలకి వెళ్లాను. వెళ్లడంతోనే అందుకున్నాడు. ఇంతసేపా రావడానికంటూ. ఏదో వదురుతుండగానే ఫైలు వెతికి బాస్ ముందుంచాను. ఒక్కసారి బిపి డౌన్ చేసుకొని, కూర్చోమన్నాడు. ఏమీ లేదు శ్రీకాంత్ పై నుంచి ప్రెషర్స్ బాగా వస్తున్నాయి. మంత్రిగారి నుంచి, ఎమ్మెల్యే నుంచి ఫోన్లు వస్తున్నాయి. తొందరగా ఆర్డర్స్ ఇచ్చేస్తే ఓ పనైపోతుందిగా మనకి అన్నాడు.

అవును సార్ చేద్దాం. మీరొక సారి ఫైల్ చూడండి. ఈ లోపల నేను వేరే ఫైల్ చూసుకొని వస్తానంటూ అక్కడి నుంచి జారుకున్నాను. పిచ్చి కోపం వచ్చింది. అరె ఏమీ బాసులో కళ్లెదుట ఫైలు పెట్టుకొని వెతుక్కోలేక టెన్షన్ క్రియేట్ చేస్తారు. వీళ్లని సంవత్సరానికోసారైనా హిమాలయాల్లో కొద్ది రోజులు వుండి రావాలి. అలాగైతేనైనా కొంచెం మార్పు వస్తుంది వీరిలో. కొత్త ఆఫీసులో చేరి పక్షం రోజులు కాలేదు. కానీ ఇంత టెన్షన్ జాబ్ అని ఊహించలేదు. ఇప్పటికే పేపర్లలో మోగుతోంది ఉద్యోగస్తులకి బిపి, షుగర్ వగైరా అన్ని రోగాలు ఈ టెన్షన్‌తోనే వస్తున్నాయని.

నా సీట్లో కూర్చోగానే ఇద్దరు వ్యక్తులు వచ్చి నా ముందు నిలుచున్నారు. అప్పుడు అర్థమైంది. వాళ్లు ఆ ఫైలుకు సంబంధించిన వారని. మేము సార్‌ని ఇంట్లోనే కలిసి వచ్చాము. సార్ పని చేసిపెడతానని చెప్పారు. మిమ్మల్ని ఒకసారి కలవమని చెప్పారంటూ కుర్చీ తీసుకొని కూర్చుంటూ ఓ కవర్ నా చేతిలో పెట్టారు. ఇద్దరివి కలిపి ఇందులో ఇరవయి వున్నాయి సార్. సార్‌వి సార్‌కి ఇచ్చాము. కొంచెం తొందరగా పని అయ్యేటట్లు చూడండి సార్! అన్నాడు మొదటి వ్యక్తి. కోపాన్ని దిగమింగుతూ ఆ కవర్ వాళ్ల చేతిలో పెట్టి సార్‌తో నేను మాట్లాడతాను. మీ పని అయ్యేటట్లు చూస్తానని చెప్తూ అక్కడి నుంచి తప్పుకున్నాను.

ఇప్పుడు అర్థమైంది. బాస్ ఎందుకు తొందరపెట్టాడో. పొలిటికల్ ప్రెజర్ కాదు. మనీ ప్రెజర్ అని గ్రహించాను. మొదలే చెప్పాను బాస్‌కి. ఇటువంటి సెక్షన్ నాకొద్దని, వినలేదు.

అప్పటిదాకా సహనంతో ఉన్న నేను వాళ్లు వెళ్లగానే బాస్ దగ్గరకి వెళ్లి నాకు నెలరోజులు లీవ్ కావాలి. అంతే కాకుండా ఈ సెక్షన్ కూడా తీసేయండి. పైసా రాబడి లేని సెక్షన్ ఏదుంటే అది నాకు ఇవ్వండని ఖచ్చితంగా చెప్పాను. బాస్ ఓ చిన్న వెకిలి నవ్వు నవ్వి, ఇదిగో శ్రీకాంత్, మొదట ఉద్యోగంలో చేరినప్పుడు నేను కూడా నీలాగే అనుకున్నానయ్యా. కానీ కుదరలేదు. అయినా ఇవన్నీ ఈ రోజులలో కామన్ అని సింపుల్‌గా చేప్పేశాడు. పుండు మీద కారం చల్లినట్లయింది. సార్ మీరు ఎలా వున్నా, ఎలా మారినా అది మీ స్వంత నిర్ణయం. నా నిర్ణయం నేను మార్చుకోలేను. మీ ఇష్టం అయితే సెక్షను మార్చండి లేకుంటే నా దారి నేను చూసుకొంటానని చెప్పి వచ్చేశాను.

ఏకంగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పడుకొన్నాను. అలారం చప్పుడుకి తెలివి వచ్చింది. లేచి చూసాను. కూతురికి ఎగ్జామ్స్ దగ్గర పడ్డాయని చదువుకొంటోంది. అయినా అలారం చప్పుడే హాయిగా వుంది. ఏ టెన్షన్స్ లేవిపుడు. తప్పు చేస్తున్నాననే బాధ అసలే లేదు. అలారం చప్పుడకి తెలివైనా సంతోషంగా లేచాను పడక నుంచి.

– గుర్రం విజయ మహేశ్వర్ రెడ్డి